క్లుప్తంగా

కలప దుంగలు స్వాధీనం

రుద్రవరం: మండలంలోని ముకుందాపురం గ్రామ సమీపంలోని చెరువు వద్ద ఎద్దుల బండిపై తరలిస్తున్న బిల్లుడు జాతికి చెందిన కలప దుంగలను స్వాధీనం చేసుకున్నామని రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతినాయుడు గురువారం తెలిపారు..స్థానిక అటవీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ.. ఎద్దుల బండిపై కలప దుంగులు అక్రమంగా తరలిపోతున్నాయనే సమాచారం మేరకు నూతల సెక్షన్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఎఫ్‌బీఓ రామకృష్ణ, నూతల నార్త్ బీట్ ఎఫ్‌బీఓ నాగేంద్రయ్య దాడి చేయడంతో బండి, కలప దుంగలను వదిలి నిందితులు ఎద్దులతో పారిపోయారన్నారు. దీంతో ట్రైర్ల బండి,మూడు బిల్లుడు జాతికి చెందిన కల ప దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బీమా తక్షణ సాయం అందజేత



నామినీకి నగదు అందజేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన సూరటి వెంకటలక్ష్మీ అనే మహిళ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. ఆమెకు వైఎస్సార్ బీమా అర్హత ఉండటంతో తక్షణ సాయం కింద రూ.10వేలను గ్రామ సర్పంచ్ శివ రామిరెడ్డి మృతురాలి కూతురు నామినీ సుమిత్రకు గురువారం అందజేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉజ్మా, వలంటీర్ హరిబాబు ఉన్నారు.

రేపు జిల్లా స్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 9వ తేదీన నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో రోటరీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి చెస్ పోటీలు వివిధ వయస్సు కేటగిరీల్లో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ చూపిన వారు విజయవాడ, తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పాల్గొనే వారు పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు సెల్: 9010451585 నంబర్‌లో సంప్రదించాలని టోర్నమెంట్ డైరెక్టర్ సుబ్బయ్య కోరారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను వినియోగించుకోండి

రుద్రవరం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోనే అందిస్తున్న అత్యుత్తమ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రుద్రవరం పీహెచ్‌సీ వైద్యులు శివమోహన్ తెలిపారు. గురువారం మండలంలోని శ్రీ రంగాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 142 మందికి బీపీ,షుగర్,రక్త శాతం, జ్వరం,జలుబు వంటి వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం కదల్లేని స్థితిలో ఉన్న రోగులను ఇంటి వద్దకే వెళ్లి పరీక్షించి మందులు అందించారు.ఎంఎల్‌హెచ్‌పీ శ్రీలత,ఎంపీహెచ్‌ఈఓ బాషా ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై శిక్షణ

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పీడీలు దేవేంద్ర, శ్రీధర్, బాలకృష్ణ, సరళలు కబడ్డీ కోర్టు, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులకు సంబంధించిన కొలతలు ఎలా వేసుకోవాలో డిజిట్ బోర్డు ద్వారా సూచించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి, హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

నంద్యాల(వ్యవసాయం): భూ హక్కు చట్టం 2023కు సంబంధించిన యాక్టు 27ను రద్దు చేయాలని బార్ అసోసియేషన్ కోరారు. గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కోర్టు నుంచి టెక్కె, నాగులకుంట , శ్రీనివాసనగర్ రోడ్డు నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గోళ్ల జయకృష్ణ, ప్రతాపరెడ్డి మాట్లాడుతూ 27 యాక్టును రద్దు చేయాలని, భూ వివాదాలను పరిష్కరించే బాధ్యతను న్యాయ వ్యవస్థను కాదని, రెవెన్యూ అధికారులకు అప్పగించడం తగదన్నారు. వెంటనే జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు రవీంద్ర, రాజేశ్వరి, విజయశేఖర్‌రెడ్డి, రఘుప్రకాష్, హరిప్రసాదరెడ్డి, మురళీ, ఖాద్రీ, కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

విళక్కి మహోత్సవాలు ప్రారంభం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని గుడిపాటి గడ్డలో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో 44వ మండలి విళక్కి మహోత్సవ వేడుకలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గో పూజ, గంగపూజ, గణపతి పూజ జరిపించారు. తదనంతరం కలశ పూజ, అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టారు. చివరగా ధ్వజారోహణ కార్యక్రమం చేసి, స్వామి వారికి మహామంగళ హారతులు ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో వనభోజనం

చాగలమర్రి: స్థానిక చిన్నమకానం వీధిలోనున్న పాతశివాలయంలో వెలసిన శ్రీభీమలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా గురువారం వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు వైఎస్సార్ జిల్లా, బ్రహ్మంగారి మఠం గ్రామానికి చెందని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నాగశివసాయి రూ.15వేలు విరాళంగా అందజేశారని ఆలయ పాలక మండలి చైర్మన్ రామసుబ్బారెడ్డి తెలిపారు. ముందుగా ఆలయంలో స్వామివారికి అభిషేకం, అన్నాభిషేకం, 108 దీపాలతో హారతి, పార్వతీ దేవికి ఒడి బియ్యం, లలితాపారాయణం తదితర పూజా కార్యక్రమాలు జరిపించారు. పూజల్లో జెడ్పీటీసీ దంపతులు లక్ష్మీదేవి, కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేశ్‌రెడ్డి, ఆలయ పాలక వర్గ సభ్యులు శ్రీనివాసులు గౌడ్, చక్రపాణి గౌడ్ పాల్గొన్నారు.

ఈమె పేరు వర్ధనమ్మ. నంద్యాల జిల్లాలోని శిరివెళ్ల గ్రామంలో నివాసముంటుంది. కుటుంబ పోషణ భారం మొత్తం ఈమెపైనే ఉండటంతో ఏడాది నుంచి అద్దె ఆటో నడుపుతూ జీవనం సాగిస్తోంది. విషయం తెలుసుకున్న అధికారులు ఈమెకు సొంత ఆటో సమకూర్చేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో రూ.3లక్షల వడ్డీలేని రుణం మంజూరు చేశారు. ఉన్నతి పథకం కింద మంజూరైన ఈ రుణాన్ని నాలుగేళ్ల పాటు క్రమం తప్పకుండా ప్రతి నెలా కంతుల రూపంలో చెల్లించాలి. ఈనెల 7న జిల్లా కలెక్టర్ నుంచి ఆటో అందుకుంది.



ఈమె పేరు నాగమణి వెలుగోడు గ్రామం. ఎనిమిది నెలల నుంచి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంది. కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న ఈమె పొదుపు సంఘంలో చేరడంతో అరుణోదయ మహిళా పొదుపు గ్రూపునకు ప్రభుత్వం వడ్డీ లేని రుణం మంజూరు చేసింది. సొంత ఆటో లేక ఇంటి వద్దనే ఉంటున్న ఆమె పరిస్థితిని గమనించిన అధికారులు ఉన్నతి పథకం కింద రూ.3లక్షల రుణం మంజూరు చేశారు. ఈ మొత్తంతో ఆటో కొనుగోలు చేసి, జీవనోపాధిని మెరుగుపరుచుకుంటానని ఆమె ధీమా వ్యక్తం చేస్తుంది.



మహిళా శక్తి

మారుతున్న కాలంతో పాటు తాము సైతం అంటున్నారు అతివలు. ఒకప్పుడు గృహిణిగా ఉంటున్న వారు ప్రస్తుతం అన్ని రంగాల్లో తమదైన ముద్రవేస్తున్నారు. కొన్ని రంగాలు కేవలం పురుషులు మాత్రమే చేయగలరే భావనను వారు బద్దలుగొట్టారు. ప్రస్తుతం ఆటో డ్రైవర్లుగా మహిళలు దూసుకెళ్తున్నారు. కుటుంబ బాధ్యతలు తమపైనే ఉండటం, జీవన స్థితిని మెరుగు పరుచుకోవడానికి తాము ఆటో తోలుతున్నామని పేర్కొంటున్నారు.

- ఆటో డ్రైవర్లుగా రాణిస్తున్న అతివలు
- బతుకు బండి నడపడంలో దిట్టలు
- జిల్లాలో 12మందికి పైగా మహిళా ఆటో డ్రైవర్లు
- ఎస్సీ, ఎస్టీ మహిళలకు వరంలా మహిళా శక్తి పథకం
- డ్వాక్రా సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారే అర్హులు

నంద్యాల(న్యూటౌన్): కాలంతో పరుగులు తీస్తున్న అతివలు వారు. పోటీ ప్రపంచంలో బతికేందుకు గౌరవప్రదమైన వృత్తి ఏదో ఒకటి చాలనుకున్నారు. పురుషులు సైతం రాణించడం కష్టమనుకునే ఆటోమొబైల్ రంగాన్ని వృత్తిగా ఎంచుకున్నారు. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తూ రద్దీ రోడ్లపై ఎన్నో సవాళ్లతో కూడుకున్న ఆటో డ్రైవింగ్‌లో రాణిస్తున్నారు. నంద్యాల జిల్లాలో ప్రస్తుతం 12 మందికి పైగా మహిళలు ఆటోలు నడుపుతూ జీవనోపాధి పొందుతున్నారు. వీరిలో చాలా మంది అద్దె ఆటోలను నడుపుతున్నారు. అనారోగ్యం కారణంగా కుటుంబ పెద్ద మంచాన పడితే కుటుంబ పోషణకు ఆటో డ్రైవర్‌గా మారిన వారు కొందరైతే, అదనపు ఆదాయం కోసం ఆటో నడుపుతున్న వాళ్లు మరికొందరు ఉన్నారు. కరోనా కారణంగా ఉద్యోగాలు పోవడంతో చదువుకున్న మహిళలు సైతం ఆటోడ్రైవర్లుగా మారి ఉపాధి పొందుతుండడం గమనార్హం. వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉన్నతి- మహిళా శక్తి పేరు తో ప్రత్యేక పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది.

వడ్డీ లేని రుణం..



అర్హులైన మహిళలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉన్నతి-మహిళా శక్తి పథకం కింద వడ్డీలేని రుణాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేస్తుంది. ఇప్పటికే జిల్లాలో ఈ పథకం కింద తొమ్మిది మంది అర్హులను ఎంపిక చేశారు. వీరంతా ఈనెల 7వ తేదీన జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆటోలు అందుకున్నారు.

ఆటో పొందడానికి అర్హతలు..

- ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేవారు గ్రామీణ ప్రాంతానికి చెంది, డ్వాక్రా సంఘాల్లో సభ్యత్వం తప్పనిసరిగా కలిగి ఉండాలి.
- 20 – 45 సంవత్సరాల్లోపు వయస్సు, డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఎల్‌ఎల్‌ఆర్ కలిగి, ఆటో నడుపుతుండగా తీసిన ఓ నిమిషం నిడివిగల వీడియోతో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆటో కొనుగోలు చేసేటప్పుడు 10 శాతం వాటా ధనాన్ని ముందుగా డ్వాక్రాసంఘం ఖాతాలో జమ చేయాలి.
- ఉన్నతి యూనిట్ ద్వారా గతంలో తీసుకున్న అప్పునకు సంబంధించి ఎలాంటి బకాయిలూ ఉండరాదు.
- అవసరమైన ఆటోను లబ్ధిదారులే ఎంపిక చేసుకోవాలి.

అర్హులందరికీ చేయూత

అర్హత ఉన్న ప్రతి మహిళకూ మహిళా శక్తి పథకం కింద రూ.3. లక్షల చొప్పున వడ్డీలేని రుణం అందిస్తున్నాం. ఈ మొత్తాన్ని నాలుగేళ్ల పాటు 48 కంతుల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఈ పథకం కింద జిల్లాలోని శిరివెళ్ల , జూపాడుబంగ్లా , గడివేములకు ఒక్కొక్కటి చొప్పున, వెలుగోడు 3, తదితర మండలాల్లో ఒకరు చొప్పున మొత్తం 12 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం.

– శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగిస్తాం

ఉయ్యాలవాడ : ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీ తొలగింపులకు సంబంధించి ఫారం–7 దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలిస్తూ చెక్ లిస్ట్ ప్రకారం సంబంధిత డాక్యుమెంట్లను ఫైల్ చేస్తూ నమోదు చేయాలని బీఎల్‌ఓలకు తహసీల్దార్ రవికుమార్ సూచించారు. మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు ఉన్నాయని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో గ్రామానికి చేరుకుని గురువారం జాబితాను పరిశీలించారు. గ్రామస్తులు మరణించిన ఓటర్లకు ధ్రువ పత్రాలను సమర్పించినా, గ్రామంలో నివాసం లేని వారి వివరాలు వెల్లడించినా పంచనామా నిర్వహించి అటువంటి ఓటర్లపై విచారణ అనంతరం జాబితాలో వారి పేర్లను తొలగిస్తామని తహసీల్దార్ తెలిపారు. తొలగించిన ఓటర్లు సరైన ఆధారాలతో మళ్లీ ఫారం–6 ద్వారా దరఖాస్తులు చేసుకుంటే ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లను నమోదు చేస్తామని చెప్పారు. వీఆర్‌ఓ వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరమ్మ నిమజ్జనం



నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీబాలాజీ కల్యాణ మండపంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బాలాజీ మహిళా మండలి ఆధ్వర్యంలో 15రోజులుగా నిర్వహిస్తున్న గౌరమ్మ పూజలు నిర్వహించారు. కాగా గురువారం ఇసుక గౌరమ్మను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. అమ్మవారికి సామూహిక అర్చనలు నిర్వహించి స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద ఉన్న భీమలింగేశ్వరస్వామి దేవస్థానం కోనేరులో పూజలు చేసి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో రాజేశ్వరి, సంగీత, శ్రీదేవి, గీత, ఆలయ పూజారి ఈశ్వర నిఖిలేష్ శర్మ, కృష్ణమూర్తి, సురేష్ బాబు, చంద్రశేఖర్, నరసింహారావు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



గుంప్రమాన్‌దిన్నెలో లబ్ధి పొందిన పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

శిరివెళ్ల: ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం గుంప్రమాన్‌దిన్నె సచివాలయ పరిధిలోని రాజనగరం, గాంధీనగరం, గుంప్రమాన్‌దిన్నె ఎస్సీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ తెలుగు, కేసీ కెనాల్‌కు సాగునీరు విడిపించి పంటలను కాపాడామన్నారు. అయితే టీడీపీ నాయకులు కేవలం పబ్లిసిటీ కోసం కాల్వల వెంట తిరిగారని విమర్శించారు. సచివాలయ పరిధిలోని గ్రామాల్లో రూ. 20 లక్షలతో సిమెంట్ రోడ్లు, మన బడి నాడు- నేడు కింద రూ.1.25 కోట్లతో పాఠశాలల అభివృద్ధి , రూ.1.45 కోట్లతో గ్రామీణ రోడ్లు వేయించామన్నారు. ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని రాజనగరం గ్రామస్తులు, ఉన్నత పాఠశాల టీచర్లు ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, ఎంపీపీ నాయక్ వసీం, సర్పంచు తలారి జానకమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా, మండల అధ్యక్షులు బీ.అబ్దుల్ సలాం, ఇందూరి ప్రతాపరెడ్డి, నాయకులు ఉశేనిరెడ్డి, నరసింహారెడ్డి, రాజారెడ్డి, శంకర్, శ్రీకాంత్‌రెడ్డి, బోయలకుంట్ల సర్పంచు జింకల నాగన్న, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణపై అవగాహన



గోవిందపల్లెలో జొన్న పంటను పరిశీలిస్తున్న డీపీఓ మోహన్‌రావు

శిరివెళ్ల: పంటల సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రావు గురువారం గోవిందపల్లెలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. జొన్న, మొక్కజొన్న పంటలో వచ్చే కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయిట్‌ను ఒక లీటర్‌కు 2 గ్రాములు లేదా, నోవలురోన్ 2 ఎంఎల్ ఒక లీటర్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం వరి పంట కోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఎకరాకు 35 నుంచి 38 బస్తాల దిగుబడి వస్తుందని చెప్పారు. ఏఓ సుధాకర్ ఉన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

ఆళ్లగడ్డ: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి, యువతకు ఓటు హక్కు కల్పించేందుకు కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తహసీల్దార్ హరినాథరావు సూచించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో అవహన ర్యాలీ చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పాత బస్టాండు మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవ హారంగా ఏర్పడి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎన్నికల డీటీ చంద్రశేఖర్, బీఎల్‌ఓలు ఉన్నారు.

నంద్యాల(న్యూటౌన్): 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. గురువారం కళాశాల విద్యార్థులతో కలిసి అధ్యాపకులు ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బొమ్మల సత్రం నుంచి చామకాల్వ వరకు జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామానికి ఓటు హక్కు పునాది అని అన్నారు. ఎన్‌సీసీ అధికారి డాక్టర్ గంగన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక 12వ వార్డు శ్రీదేవి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వార్డు ఇన్‌చార్జ్ గోపాల్ రెడ్డితో నిర్వహించారు. ముందుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ అందజేసి పథకాల లబ్ధిని వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని అక్కడేనున్న అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్లగా హామీల అమలుకు కట్టుబడిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని టీడీపీ నాయకులు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కరోనా కష్టకాలంలో తల దాచుకున్న టీడీపీ గ్యాంగ్.. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేస్తుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, నంద్యాల 3వ పట్టణ అధ్యక్షుడు జాకీర్ హుసేన్, నాయకులు సలాముల్లా, పడకండ్ల సుబ్రహ్మణ్యం, కుమ్మరి రాముడు, డాక్టర్ ఎస్ఎండీ రఫీ, రామకృష్ణారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, గంగుల జనార్ధన్‌రెడ్డి, హుసేన్, ఆచారి, అమృతరాజ్, కిరణ్‌కుమార్, సోమశేఖరరెడ్డి, లక్ష్మీనారాయణ, గన్నికరీం, సందీప్, షారుక్ పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న రమణమూర్తి

నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై పశుసంవర్ధక శాఖ సిబ్బంది సమగ్ర అవగాహన కలిగి ఉండాలని ఉప సంచాలకులు రమణమూర్తి తెలిపారు. గురువారం డీడీ కార్యాలయంలో నేషనల్ లైవ్‌స్టాక్ మార్గదర్శకాలకు అనుగుణంగా సిబ్బందికి టెక్నికల్ సెమినార్, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉదయం సెషన్‌లో సహాయ సంచాలకులు, పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులకు, మధ్యాహ్నం పారా సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పశు ఆరోగ్య కార్డుల నమోదు, గ్రేడింగ్ విధానం, పాడి పశువుల సమగ్రాభివృద్ధి, పాల ఉత్పత్తి పెంపుదల, పశుగ్రాస కొరత నివారణ అంశాలపై సూచనలిచ్చారు. కర్నూలు ఏడీడీఎల్ సహాయ సంచాలకులు డా.రవిబాబు, పలువురు ఏడీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

గోస్పాడు: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వర్ రెడ్డి సూచించారు. మండలంలోని గోస్పాడు, ఒంటివెలగల, ఎం .కృష్ణాపురం గ్రామాల్లో మండల స్థాయి అధికారులతో కలిసి గురువారం ఇంటింటికీ తిరిగి బడి బయట పిల్లలను గుర్తించారు. ఆయన మాట్లాడుతూ గోస్పాడులో ఐదుగురు, ఎం. కృష్ణాపురంలో ఒకరు, ఒంటి వెలగలలో ఇద్దరు చొప్పున విద్యార్థులకు పాఠశాలల్లో చేర్పించినట్లు చెప్పారు. ఎంఈఓ అబ్దుల్ కరీం, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనసూయ పాల్గొన్నారు.

దొర్నిపాడు: పిల్లలు పనిలోకాదని బడిలో ఉండాలని మండల ప్రత్యేక అధికారి, తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణయ్య సూచించారు. గురువారం మండలంలోని గుండుపాపల, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, కొండాపురం గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఎంఈఓ రామచంద్రయ్య, సీఆర్‌పీ శివకుమార్ పాల్గొన్నారు.

జీఈఆర్ సర్వేపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ శామూన్

నంద్యాల: మిషన్ జీఈఆర్ వంద శాతం సర్వేలో భాగంగా బడి ఈడు పిల్లలందరూ బయట ఉండకుండా పాఠశాలల్లోనే ఉండేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో మిషన్ జీఈఆర్ సర్వేపై డీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, పాఠశాల హెచ్ఎంలు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే వందశాతం పూర్తయిన తొలి జిల్లాగా నంద్యాల జిల్లా దేశంలో నమోదైందని, ఈ మేరకు చిన్న చిన్న కారణాల వల్ల దీర్ఘకాలంగా బడికి వెళ్లని బడి ఈడు పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలలకు పంపేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కార్మిక సంఘాలు, మైనింగ్ తదితర అన్ని సెక్టార్లతో సమావేశం నిర్వహించి మోటివేట్ చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్లు కోరారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి ఆశా కార్యకర్తలు నిరసనకు దిగగా అడ్డు తప్పించేందుకు పోలీసులు యత్నించగా తోపులాట జరిగింది. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రూ.26వేలు జీతం ఇవ్వాలని, కరోనాలో చనిపోయిన వర్కర్లకు రూ.50లక్షలు బీమా, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, బాలకృష్ణ, అబ్బాస్, కుళాయి స్వామి, ఆశా వర్కర్ యూనియన్ నాయకురాలు వేదావతి, వెంకటేశ్వరమ్మ, చిట్టెమ్మ, రామాంజనమ్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్యానికి పెద్దపీట



అజెండాలోని అంశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం జరిగింది. ఇందుకు హెచ్‌డీఎస్ అధ్యక్షుడి హోదాలో ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అజెండాను చదివి వినిపించారు. అజెండా అంశాలపై సమావేశంలో చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హెచ్‌డీఎస్ కృషి చేస్తోందని చెప్పారు.

ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం):ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా అ ధ్యక్షుడిగా భవనాసినాగమహేష్ ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఉమ్మడి కర్నూలు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వీరబొమ్మ నాగసత్యనారాయణ మాట్లాడుతూ అధ్యక్ష పదవీ కాలం రెండుసంవత్సరాల పాటు కొనసాగుతుందని, మొదటి సంవత్సరం భవనాసి నాగమహేష్, రెండవ సంవత్సరం బింగుమళ్ల శ్యాంసుందర్ గుప్తా వ్యవహరిస్తారని చెప్పారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భాస్కర్ (ఆత్మకూరు), ప్రధాన కార్యదర్శి విజయశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు.

హామీలు నెరవేర్చినందుకే ప్రజల్లోకి వెళ్తున్నాం





36వ వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి,25వ వార్డులో మాట్లాడుతున్న కౌన్సిలర్ కృష్ణమోహన్

నంద్యాల(సిటీ): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చినందనే ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక 36వ వార్డులో వార్డు కౌన్సిలర్ నాగినిరెడ్డి ఆధ్వర్యంలో వార్డుకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వార్డులో నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డు వాసులకు డీబీటీ, నాన్‌డీబీటీ కింద రూ.14.49 కోట్లు వెచ్చించామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, జేసీఎస్ మండల కన్వీనర్ దాల్‌మిల్ అమీర్, నాయకులు విజయేశ్వరరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, వెంకటరెడ్డి, 36వ వార్డు కన్వీనర్ పూర్ణమ్మ,, లోహిత్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీరాములు, ఆలమూరు రవి, రాజు, పుల్లయ్య పాల్గొన్నారు.


– 25వ వార్డులో వార్డుకు పోదాం కార్యక్రమాన్ని కౌన్సిలర్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సన్నల సాయిరాంరెడ్డి పాల్గొన్నారు.



డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మండలంలోని చాపిరేవుల గ్రామంలో లబ్ధిదారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.26.57 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. గ్రామంలో గురువారం పల్లెకు పోదాంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎంపీటీసీ రత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి అంకన్న పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సక్రమంగా నమోదు చేయాలి



ఓటరు జాబితాపై సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్

గోస్పాడు: ఓటరు జాబితాను సక్రమంగా నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని పసరపాడు గ్రామంలో రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటరు జాబితా సిద్ధం చేయాలని, అందుకు అనుగుణంగా రెవెన్యూ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన యువతను మాత్రమే ఓటరుగా నమోదు చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో చేపట్టే మార్పులు, చేర్పులకు సంబంధించిన ధ్రువ పత్రాలు తప్పనిసరన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈఆర్వో అనురాధ, తహసీల్దార్ విజయ శేఖర్, డీటీ రామచంద్రరావు, వీఆర్వోలు ఉన్నారు.

అయ్యలూరులో 'నా సంతకం మాతృభాషలోనే'

నంద్యాల(అర్బన్): అయ్యలూరు ఎంపీయూపీ ఉర్దూ పాఠశాలలో నా సంతకం నా మాతృభాషలోనే అనే కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధుడు సుబ్రహ్మణ్యం భారతి జయంతి సందర్భంగా దేశ భాషల ఉత్సవాల వేడుకల్లో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఆల్ మదద్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్ల రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దేశంలోని 22 భాషలకు సంబంధించిన పదాల పలకరింపు అనే అంశంపై పలువురు అవగాహన కల్పించారన్నారు.